విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు


మందుల కోసం బారులు తీరిన రోగులు


జ్వరపీడితులతో కిటకిటలాడుతున్న చిన్న పిల్లల వార్డు

- రోగులతో కిటకిటలాడుతున్న హిందూపురం ప్రభుత్వాస్పత్రి
- చిన్నపిల్లల వార్డులో బెడ్లు కరువు
- జ్వరాలు తగ్గడం లేదని బాధితుల ఆందోళన

హిందూపురం: వర్షాల కారణంగా ఎక్కడపడితే గోతుల్లో నీరునిలిచిపోయి దోమలకు అవాసంగా మారుతున్నాయి. దీనికి తోడు చెత్తా చెదారం నిండి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. డెంగీ, మలేరియా, విరేచనాలు, వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇందులో భాగంగానే రోజూ వందల సంఖ్యలో రోగులు ఆస్పత్రికి చికిత్స కోసం బారులు తీరుతున్నారు.

రోజూ 1100 మందికి దాకా...

హిందూపురం ప్రభుత్వాస్పత్రికి రోజూ దాదాపు 900 నుంచి 1100 మంది దాకా ఓపీ రోగులు చికిత్స కోసం వస్తున్నారు. వారం రోజులుగా దాదాపు 950 మంది ఇన్‌పేషెంట్స్‌గా వైద్యం పొందుతున్నారు. అధికంగా చిన్నపిల్లలు విరేచనాలు, జ్వరాలకు చికిత్సలు పొందుతున్నారు. పదే పదే వైద్యం కోసం వస్తున్నా సెలైన్లు, మందులు ఇచ్చి మాత్రం ఇచ్చి పంపిస్తున్నారు. ఎంసీహెచ్ కేంద్రంలో బెడ్లు, వసతులు బాగానే ఉన్నా మెరుగైన వైద్య సేవలు అందటంలేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జ్వరాలతో చికిత్స పొందుతున్న మూడు నాలుగు రోజులు అవుతున్నా అవే మందులు ఇస్తుండటంతో రోగాలు తగ్గడం లేదని వాపోతున్నారు. అయితే జిల్లా ఆస్పత్రిలో సిటీ స్కానింగ్, రేడియాలజిస్ట్ లేకపోవడంతో జబ్బులను గుర్తించి ఫలితాలు తెలపడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

చిన్నపిల్లల వార్డులో బెడ్లు కరువు

చిన్నపిల్లలను వివిధ అనారోగ్య సమస్యలతో తల్లిదండ్రులు హిందూపురం ఆస్పత్రికి తీసుకొస్తున్నారు. అయితే చిన్నపిల్లల వార్డులో బెడ్లు కరువవుతున్నాయి. దీంతో ఒక బెడ్‌పై ఇద్దరి పడుకోబెట్టి చికిత్స చేస్తున్నారు. చిన్నారులు దగ్గు, విరేచనాలు, జ్వరాలతో బారిన పడి అధికంగా చికిత్సలు పొందుతున్నారు. వైరల్ ఫీవర్, టైఫాయిడ్ కేసులు అధికంగా నమోదు అవుతున్నాయి.

ప్రైవేటు క్లినిక్ నిర్వాహకుల దందా

సీజనల్ వ్యాధులు పెరిగిన నేపథ్యంలో ప్రైవేటు క్లినిక్‌లకు కూడా రోగులు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని ఆస్పత్రుల్లో డెంగీ, మలేరియా పేర్లు చెప్పి పిల్లల తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. చేయి పట్టిందే తడువుగా రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు. అ తర్వాత చిన్నపాటి జ్వరానికైనా సెలైన్, ఇతర మందులు రాసి దోచేస్తున్నారు.

గత పది రోజుల్లో జ్వరాలు, రోగాల బారిన పడిన వారి సంఖ్య

హిందూపురం: అవుట్ పేషెంట్స్ : **6,300**

ఇన్‌పేషెంట్స్ : **950**

చిలమత్తూరు: **900** కేసులు

లేపాక్షి : **650** కేసులు

జ్వరం తగ్గడం లేదు



నా కూతురు నాలుగురోజులుగా జ్వరంతో ఇబ్బంది పడుతోంది. డాక్టర్ వచ్చి పరీక్షించి వైద్యం అందిస్తున్నారు. రోజూ మందులు, ఇంజక్షన్లు వేయిస్తున్నా తగ్గడం లేదు. దీంతో చాలా ఆందోళనగా ఉంది.

– వర్షిత, కోడిపల్లి

బెడ్లు నిండిపోయాయి



హిందూపురం ఆస్పత్రిలో జ్వరాలతో బెడ్లన్నీ నిండిపోయాయి. నాలుగు రోజులుగా నాకు జ్వరం తగ్గడం లేదు. దోమల కారణంగా డెంగీ జ్వరాలు వస్తున్నాయని డాక్టర్లు చెబుతున్నారు. ఇప్పటికే రెండు సార్లు రక్తపరీక్షలు చేయించాము. చిన్న పిల్లల వార్డులో ఎటు చూసినా జ్వరపీడితులే కనిపిస్తున్నారు.

– కరుణశ్రీ, హిందూపురం

నాలుగు రోజులుగా ఇబ్బంది



నేను ఇంటర్ చదువుతున్నా. నాలుగురోజులుగా తీవ్ర జ్వరం వస్తోంది. ఏమాత్రం తగ్గడంలేదు. రక్త పరీక్షలు కూడా చేయించాము. ప్రైవేట్ డాక్టర్ వద్ద చూపించినా తగ్గలేదు. దీంతో ప్రభుత్వాస్పత్రిలో చేరాను. ఇంకా జ్వరం తగ్గలేదు. దోమల ప్రభావంతోనే జ్వరాలు అధికం అవుతున్నాయని డాక్టర్లు చెబుతున్నారు.

–ముబారక్, కిరికెర, హిందూపురం

మందుల కొరత లేదు



ఆస్పత్రిలో వైద్యుల కొరత లేదు. మందులు కూడా అన్నీ అందుబాటులో ఉన్నాయి. రోగులు వచ్చిన రోజే రోగాలు తగ్గిపోవాలనే భావన ఉంటుంది. సీజినల్ కారణంగా రోగుల సంఖ్య కొంచెం పెరుగుతోంది. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. పరిసరాల్లో మురికి నీటి నిల్వలు లేకుండా చూసుకుంటూ రాత్రివేళల్లో దోమతెరలు వాడాలి.

– రోహిల్, సూపరింటెండెంట్, హిందూపురం

క్లుప్తంగా

ప్రమాదంలో మహిళ మృతి

పావగడ: బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఓ మహిళా కూలీ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... పావగడ తాలూకా ఆర్.డి.రొప్ప గ్రామానికి చెందిన 16 మంది వ్యవసాయ కూలీలు పని కోసం బుధవారం ఉదయం ఆటోలో అనంతపురం జిల్లా కంబదూరుకు బయలుదేరారు. మార్గం మధ్యలో కుర్లపల్లి మందలట్టి వద్దకు చేరుకోగానే కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన విశ్రాంత ఎంఈఓ ఈరన్న కుటుంబసభ్యులతో వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళా కూలీ అన్నపూర్ణమ్మ (45) అక్కడికక్కడే మృతి చెందింది. విశ్రాంత ఎంఈఓతో పాటు ఆయన తమ్ముడు, బొలెరో డ్రైవర్ మహబూబ్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను బెంగళూరుకు తీసుకెళ్లినట్లు సమాచారం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సోలార్ పార్క్‌ను పరిశీలించిన ఎమ్మెల్యేల బృందం


సోలార్ ప్యానల్స్‌ను వీక్షిస్తున్న ఎమ్మెల్యేల బృందం

పావగడ: రాష్ట్ర వ్యాప్తంగా పలు విధాన సభ క్షేత్రాల కాంగ్రెస్ ఎమ్మెల్యేలు స్థానిక తిరుమణి సోలార్ ప్రాజెక్ట్‌ను వీక్షించడానికి బుధవారం పావగడకు ప్రత్యేక బస్సులో వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదేశ్‌బాబు, మున్సిపల్ చైర్మన్ రాజేశ్ తదితరులు వారికి స్వాగతం పలికారు. సోలార్ ప్రాజెక్ట్‌ను పరిశీలించి అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సోలార్ పార్క్ ఎండీ గౌరవ గుప్తా సోలార్ పార్క్ ఆవిర్భావం, సౌర విద్యుత్ ఉత్పాదన గురించి వారికి వివరించారు.

నూతన పద్ధతులతో అధిక దిగుబడులు


మాట్లాడుతున్న శాస్త్రవేత్త చంద్రాయుడు

అమరాపురం: బోరు బావుల కింద వక్క పంటలు సాగు చేసే రైతులు నూతన పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు చంద్రాయుడు, యుగంధర్ తెలిపారు. బుధవారం స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయం ఆవరణలో మండలంలో వక్క సాగు చేస్తున్న రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు వక్క తోటను సాగు చేసేటప్పుడు నాణ్యమైన మొక్కలను ఎంచుకోవాలన్నారు. రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి వస్తుందన్నారు. వక్కకు ఆశించే తెగుళ్ల గురించి వాటి నివారణ పద్ధతులను శాస్త్రవేత్త యుగంధర్ రైతులకు తెలియజేశారు. ఏఏ కాలంలో ఏం మందులు పిచికారీ చేయాలో వివరించారు.

ఉషశ్రీచరణ్ నాయకత్వంలో పార్టీకి పూర్వ వైభవం

- వరద బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలిగా నూతనంగా నియమితులైన మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ నాయకత్వంలో పార్టీకి పూర్వ వైభవం వస్తుందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. ఆయన బుధవారం 'సాక్షి'తో మాట్లాడుతూ నూతన జిల్లా అధ్యక్షురాలిగా ఎంపికైన ఉషశ్రీచరణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె నాయకత్వంలో కలిసికట్టుగా పని చేసి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకువస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు ఆమెకు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని సూచించారు. విజయవాడలో వరద బీభత్సం సృష్టించడం బాధాకరమన్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు వరద బాధితులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యం సహాయక చర్యల్లో కనిపిస్తోందన్నారు. చంద్రబాబు ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతోనే వరద విజయవాడను ముంచెత్తాయని, చంద్రబాబు విజయవాడ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విలువ ఏమిటో ప్రజలకు ప్రస్తుతం తెలిసిందన్నారు. జగన్ సీఎంగా ఉండి ఉంటే వరద విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొని ఉండేవారని ప్రజలు బహిరంగంగానే చెబుతున్నారన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి


మాట్లాడుతున్న పీడీ నాగమల్లేశ్వరి

మడకశిరరూరల్: బాలింతలు, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగమల్లేశ్వరి తెలిపారు. మెళవాయిలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పంచాయితీ స్థాయి పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ముందుగా పౌష్టిహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లీలావతి, మహిళా ఆరోగ్య కార్యకర్త, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మణేసముద్రంలో పశు వైద్యశిబిరం

హిందూపురం: జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ హిందూపురం మండలంలోని మణే సముద్రంలో బుధవారం ఉచిత పశు గర్భ కోశ చికిత్సా శిబిరం నిర్వహించింది. పశువులను పరీక్షలు నిర్వహించి అవసరమైన వాటికి టీకాలు వేసి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ భవిష్యత్తులో పశు లింగ నిర్ధారిత వీర్యం అత్యధిక ప్రాచుర్యం పొందుతుందన్నారు. విదేశీ జాతులేకాకుండా స్వదేశీ జాతులైన గిర్, సాహివాల్, తార్పర్కార్ వంటి బ్రీడ్‌లను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం 43 పశువులకు గర్భకోశ పరీక్షలు చేసి వైద్యం అందించి సలహాలు, సూచనలిచ్చారు. కార్యక్రమంలో డీడీఏహెచ్ పెంచలయ్య, డాక్టర్లు నీరజ, దీపిక, పారావైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక


టీ ప్రకాష్‌రెడ్డి, పీడీ కల్లుమర్రి


పీవీ నరేంద్ర , గౌడనహాళ్లి


శివప్రసాద్, బుళ్లసముద్రం


రవికుమార్, గంతలపల్లి


సుజాత, వద్రపాళ్యం

మడకశిరరూరల్: మండలానికి చెందిన నలుగురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. కల్లుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్న టీ.ప్రకాష్‌రెడ్డి, గౌడనహళ్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పీవీ.నరేంద్ర, బుళ్లసముద్రం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు శివప్రసాద్ (ఎస్‌జీటీ), గంతలపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రవికుమార్ (ఎస్‌జీటీ)గా పని చేస్తున్నారు. వీరందరూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

మడకశిర: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సుజాత ఎంపికయ్యారు. ఆమె మడకశిర మున్సిపాలిటి పరిధిలోని వద్రపాళ్యం ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పని చేస్తున్నారు.

పెనుకొండ: నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న కృష్ణానాయక్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఆయన ఎంపిక పట్ల యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, నారాయణ స్వామి, నరేష్, రమేష్, ఉపేంద్ర, రవీంద్రనాథ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..


బ్యాటింగ్ చేస్తున్న ప్రిన్సిపాల్ సుందరరాజు

లేపాక్షి/రొళ్ల: మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా లేపాక్షిలోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులకు బుధవారం సాయంత్రం క్రీడాపోటీలు నిర్వహించారు. అలాగే రొళ్ల మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించినట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు.

గురు పూజోత్సవం సందర్భంగా వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.


రింగు ఆట ఆడుతున్న టీచర్లు


రొళ్ల : వాలీబాల్ ఆడుతున్న ఉపాధ్యాయులు

కంటి చుక్కల వైద్యానికి పోటెత్తిన జనం

పావగడ: స్థానిక రోటరీ క్లబ్ మైదానంలో బుధవారం నిర్వహించిన ఆయుర్వేద కంటి చుక్కల వైద్య శిబిరానికి వేలాది మంది తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యుడు భద్రావతి మోక్షానంద బృందం వేపాకు రసంతో తయారు చేసిన కంటి చుక్కలను వచ్చిన వారందరికీ వేశారు.

బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ

పావగడ: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో కొన్నాళ్ల క్రితం శస్త్ర చికిత్స విఫలమై మృతి చెందిన అనిత, అంజలి, లక్ష్మీ నరసమ్మ కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.4 లక్షల పరిహారం చెక్కులను ఎమ్మెల్యే వెంకటేశ్ బుధవారం అందజేశారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

సోమందేపల్లి: జ్వరాలు ప్రబలకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ గంగాదేవి సూచించారు. బుధవారం పాపిరెడ్డిపల్లి గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వైద్యుడు ఓంకార్ మాట్లాడుతూ సోమందేపల్లిలో ఓ బాలుడు శ్వాసకోశ సమస్యతో మృతి చెందాడని, డెంగీతో మృతి చెందలేదని తెలిపారు.

బాల్య వివాహాలకు చెక్ పెట్టాలి

లేపాక్షి: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న బాలికలు,

సంక్షిప్త సమాచారం

బాలింతలు, గర్భిణులు అనిమియాపై అవగాహన కలిగి ఉండేలా అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక చొరవ చూపాలని హిందూపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ రెడ్డిరమణమ్మ పేర్కొన్నారు. బుధవారం ఉదయం లేపాక్షి సెక్టార్‌లో జరిగిన పౌష్టికాహార మాసోత్సవం, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో జరిగిన కార్యక్రమాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్పెషల్ ఆఫీసర్ నీలిమా, సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, మంజుళ, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర: పట్టణంలోని ఒకేషనల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈఈటీ, జీఎఫ్‌సీ కోర్సులకు సంబంధించిన గెస్ట్ లెక్చరర్ల పోస్టులు ఒక్కొక్కటి ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 6వ తేదీలోగా అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

నేత్రదానంపై అవగాహన అవసరం

లేపాక్షి: చనిపోయిన అనంతరం మన నేత్రాలని మట్టిపాలు, అగ్గిపాలు చేయకుండా దానం చేయడం వలన మరో ఇద్దరికి ప్రపంచాన్ని చూసే అవకాశాన్ని ఇవ్వచ్చని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ఉదయం స్థానిక ఆశ్రయసేవా ట్రస్ట్‌ను సందర్శించి అక్కడ జరిగిన నేత్రదాన పక్షోత్సవం, పౌష్టికాహార వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. అదేవిధంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సులను పరిశీలించారు. లేపాక్షిలో నేత్రదానం చేసిన చాకలి గంగమ్మను అభినందించారు.

చేపల పెంపకానికి చెరువు వేలం నేడు

రొళ్ల: మండల పరిధిలోని హులికుంట చెరువులో ఏడాది పాటు చేపలు పెంపకానికి గురువారం దొమ్మరహట్టి గ్రామంలో ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్ తెలిపారు. ముందుగా రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

చవితి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

పరిగి: మండలానికి ఉన్న ప్రత్యేకత ఆధారంగా గతంలో ఎన్నడూ లేని విధంగా వినాయక నిమజ్జనోత్సవాన్ని నిర్వహించాలని అధికారులు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో తహసీల్దారు హసీనాసుల్తానా అధ్యక్షతన మండల పీస్ కమిటీ సమావేశం జరిగింది. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు.

అమాయకులకు దేహశుద్ధి

పావగడ: తిరుమణి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మమ్మనహళ్లి గ్రామంలో ఓ మహిళ అందించిన తప్పుడు సమాచారంతో రాజస్థాన్‌కు చెందిన ముగ్గురికి దేహశుద్ధి జరిగింది. సదరు మహిళ బంగారు తాళి, వెండి చైన్లను కడిగేందుకు రాజస్థాన్‌కు చెందిన ముగ్గురికి ఇచ్చింది. అయితే మాంగళ్యానికి తగిలించే కొక్కీ కనిపించలేదని వారితో ఘర్షణకు దిగింది. అంతలోనే చుట్టు పక్కల గ్రామస్తులు అక్కడికి చేరుకుని దొంగలుగా భావించి వారితో గొడవ పడ్డారు. తమపై గ్రామస్తులు దాడి చేస్తారన్న భయంతో ద్విచక్ర వాహనాల్లో వారు దౌడు తీశారు. మార్గమధ్యలో వడ్ల యంత్రాన్ని ఢీ కొట్టి తీవ్రగాయాలపాలయ్యారు. గ్రామస్తులు వారిని పట్టుకుని చెట్టుకు కట్టేసి చావ బాదారు. అనంతరం సమాచారం అందుకున్న తిరుమణి పోలీసులు ఆమెను విచారించగా ఏ వస్తువు పోలేదని సమాధానం ఇవ్వడంతో పోలీసులు నివ్వెర పోయారు. ఈ సంఘటనపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

జెడ్పీ స్కూల్ హెచ్ఎం మృతి


వేంకటేశ్వరరావు(ఫైల్)

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి పంచాయతీ సేవామందిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు (60) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. ఆయన మృతికి ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలంతో పాటు ఉపాధ్యాయులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

విద్యుత్ ప్రమాదంపై నివేదిక ఇవ్వండి

మడకశిర: పట్టణంలోని యాదవ కల్యాణ మండపం వద్ద ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాద ఘటనపై విచారణ చేసి పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని విద్యుత్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎస్పీ రత్నకు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) ఆదేశించింది. ఈ ప్రమాదంలో పట్టణానికి చెందిన పెన్న ఓబులేసు (49) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ద్విచక్ర వాహనంలో వెళుతున్నప్పుడు 11 కేవీ విద్యుత్ లైన్ తెగి మీద పడడంతో ఈప్రమాదం జరిగింది. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబ సభ్యులు తమకు నష్ట పరిహారం ఇప్పించి ఆదుకోవాలని ఎన్‌హెచ్ఆర్‌సీని ఆశ్రయించారు. దీంతో ఎన్‌హెచ్ఆర్‌సీ సంబంధిత అధికారులకు వారంలోగా ఈఘటనపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

ఆర్కిటెక్చర్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం: స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 16వ తేదీ నుంచి కొత్తగా సివిల్ రివైట్ (ఆర్కిటెక్చర్) కోర్సు ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.హరీష్‌బాబు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేవలం 30 సీట్లు మాత్రమే ఉన్నాయన్నారు. 45 రోజుల కాల వ్యవధి ఉన్న ఈ కోర్సులో చేరేందుకు ఐటీఐ, డిప్లొమా, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ ప్రదానం చేస్తుందని తెలిపారు. పూర్తి వివరాలకు 94411 92027లో సంప్రదించాలని కోరారు.

ఉషశ్రీచరణ్ ఎంపికపై హర్షం



వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సోమందేపల్లి: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలిగా ఉషశ్రీచరణ్‌ను ఎంపిక చేయడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి క్షీరాభిషేకం చేశారు. మాజీ సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో 50 వేల మెజార్టీతో ఉషశ్రీచరణ్‌ను గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు నాగప్ప, నాయకులు నరసింహమూర్తి, ఎల్లారెడ్డి, జగదీష్, ఈశ్వర్‌రెడ్డి, ఇమామ్ వలి, నర్సింహులు, పక్రుద్దీన్, కళ్యాణ్, నాగరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

రొళ్ల: మండలంలో వినాయక చవితి సందర్భంగా మంటపాలను ఏర్పాటు చేయాలనుకునే వారు తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు


ఫర్టిలైజర్ షాపులో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ

రొద్దం: ఎరువుల దుకాణాల్లో ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ ఎరువులు విక్రయించాలని లేకపోతే చర్యలు తప్పవని వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఏడీఏ స్వయంప్రభ తనిఖీ చేశారు. రమేష్ ట్రేడర్స్‌లో యజమాని రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడంతో నోటీసులు ఇవ్వనున్నట్లు ఏఓ నివేదిత తెలిపారు. తాము చెప్పేవరకూ దుకాణంలో ఉన్న ఎరువులు విక్రయించకూడదని చెప్పామన్నారు.